కుక్కలు, కోతుల స్వైరవిహారం

- జనాలపై దాడులు
- ఇంట్లోని వస్తువులను చిందరవందర చేస్తున్న వానరాలు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- నియంత్రించాలని అధికారులను వేడుకుంటున్న పట్టణవాసులు

మిర్యాలగూడ అర్బన్ : అడవుల్లో ఉండాల్సిన కోతులు జనావాసంలోకి వచ్చాయి. అసలే కోతులు వాటి చేష్టలకు ప్రజలు విసిగి వేసారి పోతున్నారు. ఇది చాలదన్నట్లుగా వీధి కుక్కలు వాటి ముందు నుంచి వెళ్లే వారిపై దాడులకు దిగుతూ గాయాలపాలు చేస్తున్నాయి. ప్రతి నిత్యం పల్లెల్లో, పట్టణంలోని పలు కాలనీల్లో ఏదో ఒక వీధిలో కోతులు, కుక్కలతో ఇబ్బందులు పడటం, అవి వెంట పడితే కింద పడి గాయాలవడం, వంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని బెంబేలెత్తుతూ భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లే సమయంలోనూ వారి వెంట పడుతుండటంతో ఒక్కోసారి బైక్‌లు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు మార్లు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు వందకు పైగా కేసులు

మిర్యాలగూడ పరిసర ప్రాంతాలు, గ్రామాలు, పట్టణంలో కుక్కలు, కోతుల కరిచి గాయాలు అయిన వారు ప్రతి నెల వందకు పైగా కేసులు నమోదు అవుతున్నాయని ఏరియా ఆస్పత్రి వైదుల లెక్కలు చెబుతున్నారు. దీంతో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట కుక్కలు, కోతులు కరిచే సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉంటున్నాయి. ఇప్పటికైనా కోతుల బెడదను తొలగించి, కుక్కలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.


మిర్యాలగూడ పట్టణంలో సంచరిస్తున్న కోతులు

మచ్చుకు కొన్ని సంఘటనలు

ప్రకాష్‌నగర్‌లో రెండు నెలల క్రితం ఒకే రోజు ముగ్గురు యువకులను కుక్కలు కరవడంతో గాయాల పాలయ్యారు.

- హౌసింగ్‌బోర్డు కాలనీలో గత 4నెలల క్రితం ఓ ఇంటిలోకి ప్రవేశించిన కోతులు ఇంట్లోని వస్తువులని పాడు చేయడంతో పాటు ఇంట్లోని మహిళపై దాడి చేసి గాయపరిచాయి.
- రవీంద్రనగర్ కాలనీలో రాత్రి సమయంలో బైక్‌పై వచ్చే వ్యక్తిపై కుక్కలు దాడి చేయడంతో కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు.
- చైతన్య నగర్‌లో 5నెలల క్రితం ఇంటి మేడపై ఉన్న ఒక వ్యక్తిపై కోతులు దాడి చేయడంతో భయంతో పరిగెత్తిన ఆ వ్యక్తి మేడ పైనుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు.
- మండలంలోని తడకమళ్ల గ్రామంలో 4నెలల క్రితం గొర్రెల మందపై దాడి చేసిన కుక్కలు 12గొర్రెలను కొరికి చంపాయి. దీంతో ఆ రైతుకు సుమారు రూ. 1లక్ష వరకు నష్ట జరిగింది.
- అదే గ్రామంలో మరో రోజు వీధిగుండా నడుచుకుంటూ వస్తున్న ఒక వ్యక్తిపై కుక్కలు కరిచి గాయపరిచాయి.

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో కుక్కలు, కోతులు అధికంగా ఉన్నాయి. ఇంటి తలుపు తెరవగానే ఇంట్లోకి ప్రవేశించి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. గ్రామంలో గుంపులుగా తిరుగుతున్న కోతులు, కుక్కలు చిన్నారులు, పశువులు, గొర్రెలపై దాడులకు దిగుతున్నాయి.దీంతో పలువురు గాయాల పాలయ్యారు. అధికారులు స్పందించి కుక్కలు, కోతులను తరిమి వేసి ఇబ్బందులను తొలగించాలి.

– అనంతుల రవి, తడకమళ్ల

నియంత్రణ చర్యలు చేపట్టాలి



పట్టణంలోని కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. బైక్‌పై వెళ్లే సమయంలో అవి బైక్ వెంట పరిగెత్తి భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఉదయం పూట వాకింగ్ వెళ్లే వారిపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలు, కోతుల నివారణ చర్యలు చేపట్టి ఇబ్బందులు తొలగించాలి.

– ముత్తినేని అప్పారావు, మిర్యాలగూడ

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం అని దేవరకొండ ఎమ్మెల్యే ,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలోని పడమటితండా, పుట్టంగండి గ్రామపంచాయతీలలో 'మన ఊరు – మన పథకాలు' కార్యక్రమంలో భాగంగా రూ.60 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణలో అన్ని వర్గాలకు న్యాయం చేయడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం .ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, సర్పంచ్‌లు బీమా, ఎంపీటీసీ సుజాత, బీఆర్ఎస్ నాయకులు తోటకూరి పరమేష్, నర్సింహ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

దేవరకొండ : మత సామరస్యానికి ప్రతీక హజహరత్ సులేమాన్ షావలి(చిన్న దర్గా) ఉర్సు అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం రాత్రి పట్టణంలో నిర్వహించిన చిన్న దర్గా ఉర్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి గంధాన్ని చిన్న దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, హనుమంతు వెంకటేశ్ గౌడ్, శిరందాసు కృష్ణయ్య, అఫ్జల్, ఉస్మాన్, సత్తార్, బాబా పాల్గొన్నారు.


దేవరకొండ : సులేమాన్ షావలి దర్గా వద్దకు గంధాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఎన్నికల ముందు జనంలోకి నాయకులు


కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం : ఎన్నికలు వస్తున్నాయనే జనంలోకి నాయకులు వస్తున్నారని, ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గుర్తు చేసుకోవాలని సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ ఇతర పార్టీల నాయకులపై పరోక్షంగా ఆరోపణలు చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 97చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్ మాట్లాడారు. సామాన్య ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలన ధ్యేమన్నారు. ప్రజలుకు సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదన్నారు. 97మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరు అయ్యితే ఎందుకు అందరు రాలేదని, మరోసారి ఇలాంటిది జరగకుండా అందరూ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేసీ ప్రమీల, ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి, సర్పంచ్‌లు అనుముల శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్, కామర్ల జానయ్య, మధా ధనలక్ష్మీ, రామ చంద్రయ్య, బైరం కృష్ణ, జంగిలి శ్రీనివాస్ రెవిన్యూ సిబ్బంది పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్సీ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నాగార్జునసాగర్ జలాశయం ఎడమ కాలువ మొదటి మేజర్ అయిన రాజవరం మేజర్ కాలువ కింద వరి సాగుచేస్తున్న రైతులకు సాగునీటి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం ఆ ప్రాంత రైతులు ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. సాగునీరు తగినంత మోతాదులో అధికారులు విడుదల చేయకపోవడంతో మేజర్ చివరి భూములకు నీరు అందడం లేదని తెలిపారు. పంటను సాగు చేసి సుమారు రెండు నెలలు కావస్తుండటంతో ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందని. దీంతో సాగు నీరు అందక వెయ్యి ఎకరాలలో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వెంటనే ఎమ్మెల్సీ ఎక్కువ మోతాదులో నీటిని విడుదల చేసి నట్‌లెత్తైనే పంటలను కాపాడే పరిస్థితి ఉందని, తక్షణమే సమస్య పరిష్కరించేలా చూడాలని అధికారులకు సూచించారు. స్పందించిన సంబంధిత అధికారులు అధిక మొత్తంలో నీటిని పెంచి మేజర్ చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్సీకి తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించి కోటిరెడ్డికి మేజర్ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్సీ కోటిరెడ్డికి విన్నవిస్తున్న రైతులు

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నేత, అసెంబ్లీ పాలక్ కవిత అన్నారు. గురువారం పట్టణంలోని హనుమాన్‌పేట, గాంధీనగర్, సిక్కుల బజారులో నిర్వహించిన బీజేపీ కార్నార్ మీటింగ్‌లో భాగంగా నిర్వహించిన శక్తి కేంద్రాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివాస్‌రావు, బంటు సైదులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి వెంకట్‌రెడ్డి, చిలుకూరి శ్యాం, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత, కనపర్తి సత్యప్రసాద్, పాతకోటి సైదులు, బీజేపీ కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నేత కవిత

వందశాతం పన్నులు వసూలు చేయాలి

దేవరకొండ : 2022–2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేవరకొండ మున్సిపాలిటి పరిధిలో వంద శాతం ఆస్తి, నీటి పన్నును వసూలు చేయాలని, మున్సిపల్ ప్రత్యేక అధికారి, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీపాద రామేశ్వర్ అన్నారు. గురువారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిర్దేశిత గడువులోగా పన్ను వసూలుకు అధికారులు కృషిచేయాలన్నారు. అనంతరం పట్టణంలో పర్యటించి పన్నుల వసూళ్లను ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మేనేజర్ ప్రశాంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్‌అలీ, నరేశ్, రమేశ్ పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న శ్రీపాద రామేశ్వర్

చలానా చెల్లించిన వారికి త్వరలో రిజిస్ట్రేషన్లు?

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని ఎన్నెస్పీ క్వార్టర్లలో నివాసముంటు డిమాండ్ నోటీసుల ప్రకారం చలానా రూపంలో చెల్లింపులు చేసిన వారికి సొంతింటి హక్కును కల్పిస్తూ త్వరలో రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. క్రమబద్ధీకరణకు జీఓ నంబర్ 58, 59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి నోటీసులు ఇచ్చారు. వారిలో రెండు, మూడో దఫాలో నేటికీ చలానా చెల్లించని వారు 81మంది ఉన్నట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన జాబితాలో పేర్లున్నాయి. వాటిలో గురువారం కొంతమంది చలానా చెల్లించారు. సుమారు 70మంది పూర్తిగా చలానా చెల్లించాల్సి ఉంది. నాల్గో శనివారం బ్యాంకు లావాదేవీలు ఉండవు. దీంతో చలానా చెల్లింపునకు శుక్రవారమే చివరి తేదీ కానుంది. కొంతమందికి ఫోన్‌ద్వారా డిమాండ్ నోటీసులు రాలేదు. దరఖాస్తుదారులు ఒకసారి మీసేవా రశీదుతో చెక్ చేయించుకుంటే వచ్చింది, రానిది తెలుస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే కొంతమందికి ఇంటి స్థలం 300గజాలు ఉంటే 600గజాలు పడింది. 300గజాలకు చెల్లించి మిగిలిన రెండు దఫాలు చెల్లించలేదు. కొంతమంది ఒకదఫాలోనే మొత్తానికి చెల్లించారు అదనంగా వచ్చిన గజాలకు చెల్లించలేదు. వారిని చెల్లించని జాబితాలోనే చూయిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారించగా ఏదైన పూర్తిగా చెల్లించిన వారికే రిజిస్ట్రేషన్ డ్యాక్యుమెంట్లు ఇస్తామని తెలిపారు. తక్కువ వచ్చిన వారు కూడా వచ్చిన మేరకే చెల్లించాలని మిగిలినది.

ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ బుద్ధవనం సందర్శన


బుద్ధుడిపాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ ఎండీ

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ స్థాయిలో నాగార్జునసాగర్‌లో నిర్మాణమైన బుద్ధవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. బుద్ధవనం చేరుకున్న వీరికి బుద్ధవనం సిబ్బంది స్వాగతం పలికారు. బుద్ధచరితవనంలోని బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ధ్యానవనం జాతకపార్కు, స్థూప పార్కులను సందర్శించారు. మహాస్థూపంలోని రెండో అంతస్తులోగల ధ్యాన మందిరంలోని ఆకాశ నిర్మాణ సౌందర్యాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధవనం సందర్శన తనకెంతో చక్కటి అనుభూతినిచ్చిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైన బుద్ధవనం ప్రపంచంలోని బౌద్ధమతస్తులతో పాటు పర్యాటకులను ఆకట్టుకోనుందన్నారు. ఇక్కడ బుద్ధుడికి సంబంధించి శిల్పసంపదను ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య కోరిక మేరకు విజయవాడ నుండి నాగార్జునసాగర్‌కు వారాంతంలో బస్సులను నడుపుతామన్నారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం నిర్మాణ విశేషాలను వివరించారు. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ రోడ్డురవాణ సంస్థ ఈడీ బ్రహ్మానందరెడ్డి, డీఎస్పీ జయరాం ప్రసాద్, సీఐలు ఫమీముల్లా, బాలకృష్ణ, విజయపురి సౌత్ ఎస్ఐ అనిల్‌కుమార్ రెడ్డి బుద్ధవనం పర్యవేక్షకులు నరసింహారావు తదితరులు ఉన్నారు.

జానారెడ్డికి సన్మానం


జానారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హాలియా : ఆలిండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ)లో సభ్యుడిగా ఎన్నికైన మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం హాలియా పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సపావట్ పాండునాయక్ నేతృత్వంలో జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

చింతపల్లి : మండల పరిధిలోని నెల్వలపల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి, ద్వితీయ బహుమతులను గురువారం నిర్వాహకులు అందజేశారు. అనంతరం ఎస్ఆర్ఐ కుటుంబరావు, ప్రణవ గ్రూప్ చైర్మన్ బూరుగు రవికుమార్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న 15 క్రికెట్ జట్లకు క్రికెట్ కిట్లు, డ్రెస్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, పెద్ద జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


మిర్యాలగూడ టౌన్: కంటి పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కౌన్సిలర్ పత్తిపాటి సంజాతన వాబు అన్నారు. గురువారం పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరం మూడు రోజుల పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవకమ్మ, మాజీ కౌన్సిలర్ పత్తిపాటి నవాబు, శివరాం, సంపత్, వెంకట్‌రెడ్డి, మౌలానా, చంటి, డాక్టర్లు నితిన్, లక్ష్మిప్రసన్న, ఆశా వర్కర్లు జ్యోతి, ధనలక్ష్మి తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని చింతకుంట్లలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. కంటి సమస్యలున్న వారు కంటి వెలుగు శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ వెంట మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, ఉపసర్పంచ్ ఏకుల సురేష్, డాక్టర్ రసూల్, ఆప్తాల్మిక్ మహేశ్, సూపర్‌వైజర్ రాణి, డీఈఓ విక్కిరాథోడ్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

చింతపల్లి : తీదేడు గ్రామ సర్పంచ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులపై చేసిన వ్యాఖ్యలు సరికావని ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోవర్ధనాచారి ఖండించారు. గురువారం గ్రామంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకురులు సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాభివృద్ధికి పాటుపడకుండా పలు భూకబ్జాలకు పాల్పడ్డారని, జోడో యాత్రలో బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని అనడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో మాదగోని కృష్ణగౌడ్, కాయితి బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, శివర్ల శ్రీనుయాదవ్, రాకేశ్, సోమలింగం, సురేందర్‌రావు, శ్రీనివాసరావు, ముత్తయ్య, శ్రీశైలం, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

మిర్యాలగూడ : పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగిసింది. పట్టణంలోని 48 వార్డులకుగాను 12,436 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీఓ చెన్నయ్య తెలిపారు. ఈనెల 19న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఐదు రోజులపాటు కొనసాగి గురువారం ముగిసినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీకి ఎంపిక చేస్తామన్నారు. విచారణ అధికారులకు ఎవరైనా తప్పుడు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విచారణను అధికారులు బాధ్యతాయుతంగా చేపట్టాలని సూచించారు.

నేడు రగ్బీ టోర్నమెంట్

దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ సహకారంతో నేడు దేవరకొండలోని అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్–17 టచ్ రగ్బీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో కొత్తగా రగ్బీ క్రీడను పరిచయం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కడారి యాదగిరి, అంజద్ తదితరులున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

డిండి : ప్రభుత్వ ఐటీఐలో ప్రైవేట్‌గా పరీక్ష వ్రాసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను సీస్వీకరిస్తున్న మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ భయ్యా మల్లయ్య గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మల్లేపల్లి డిప్యూటీ డైరెక్టర్(ఆర్‌డీడీ) కార్యాలయంలో దరఖాస్తులు లభిస్తాయని, ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. యస్‌సీవీటీ(స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రెనింగ్), సీఓఈ(సెంటర్ ఆఫ్ఎక్సలెన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థులతోపాటు ఏదైనా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో మూడేళ్ల పాటు పని అనుభవం జీపీఎఫ్/ఈపీఎఫ్ అర్హత కల్గిన వారు ఆర్‌డీడీ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు ఆర్‌డీడీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పరిశీలించిన డీఈసీ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను గురువారం డీఈసీ(జిల్లా విద్యా కమిటీ సభ్యులు) వి.భానునాయక్ పరిశీలించి మాట్లాడారు. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డీఈసీ కమిటీ సభ్యులు కె. నరేందర్, ఎండీ ఇస్మాయిల్, డీఓ బత్తుల సాయిలు, ప్రిన్సిపాల్ దుండిగళ్ల అశోక్, ఏవో గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులు అధికారుల సలహాలు పాటించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పాడి రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించినట్లయితే పశుపోషణలో అధిక లాభాలన పొందవచ్చని మండల పశు వైద్యాధికారి డాక్టర్ కేశవ్ అజ్మీరా అన్నారు. ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను గురువారం మండలంలోని ఎర్రచెరువుతండా, తెట్టకుంట, నేతాపురం గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవ్ అజ్మీరా మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 27 వరకు నట్టల నివారణ మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషిచేయాలి

మిర్యాలగూడ : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోట పనిచేస్తున్న టీఏలు, ఎఫ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని సిబ్బంది దినసరి కూలీలతో పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పగిడిమర్రి శిరీష, జూనియర్ అసిస్టెంట్ పోషయ్య, టైపిస్ట్ ఫెరోజ్, టీఏలు రేణుక, కళావతి, రాజేశ్వరి, అండాలు, పురుషోత్తం, పంచాయతీ ఆపరేటర్లు నాగేంద్రచారి, పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'కల్పవల్లి' స్కాలర్‌షిప్ చెక్కులు అందజేత

కొండమల్లేపల్లి : 2021–2022 విద్యా సంవత్సరానికి గాను నెల్లి ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే కల్పవల్లి స్కాలర్‌షిప్‌కు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. గురువారం ఆ విద్యార్థినులకు స్కాలర్‌షిప్ చెక్కులను హెచ్ఎం మంద సత్యనారాయణ అందజేసి మాట్లాడారు. విద్యార్థినులు ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక అయ్యేందుకు కృషిచేసిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు డి.సైదానాయక్‌ను హెచ్ఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో కొర్ర లోక్యనాయక్, నల్లా నరసింహులు, సముద్రాల శ్రీనివాస్, సూర్య, సౌజన్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి : జూలకంటి

మిర్యాలగూడ అర్బన్ : మార్చి 1, 2, 3 తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగసభకు గిరిజనులు భారీ ఎత్తున తరలిరావాలని సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బోటియా నాయక్ తండాలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1వ తేదీన ఎన్ఎస్పీ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్, నాయకులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

దరఖాస్తు గడువు పెంచాలని వినతి


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మిర్యాలగూడ టౌన్ : ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ : పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపునకు లబ్దిదారుల నుంచి స్వీకరించే దరఖాస్తుల గడువు పెంచాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన పేదలందరికీ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దరఖాస్తులతో పాటు ఎస్సీ, ఎస్టీలకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలనే నిబంధనలు పెట్టినందునా కొంత వరకు గడువును పెంచాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ హాజీకి వినతిపత్రం అందజేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఈనెల 23తో ముగుస్తుందని, దీంతో చాలా మంది అర్హులైన పేదలు ఉన్నారని, వారికి ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ సర్టిఫికేట్లు దరఖాస్తులతో జతచేయాల్సి ఉన్నందున చాలా మంది వరకు ఇంకా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ సర్టిఫికేట్ల కోసం తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రతన్‌సింగ్‌నాయక్, రాష్ట్ర నేత శ్రీనివాస్‌రావు, జిల్లా పురుషోత్తంరెడ్డి, సైదులు, సత్యప్రసాద్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, శ్యాం, బంటు గిరి పాల్గొన్నారు.

దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కేసీఆర్

- ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : తెలంగాణలోని దళితుల జీవితాల్లో నిజమైన వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 75మంది లబ్ధిదారులకు రూ.10లక్షల చొప్పున రూ.7.50కోట్ల విలువ గల ట్రాక్టర్లు, జేసీబీలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి వారు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపిక చేసిన వంద మంది దళితబంధు లబ్దిదారులకు మంజూరు పత్రాలను, యూనిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. దళితుల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ చేపడుతున్న పలు పథకాలు, విధాన నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు కుందూరు వీరకోటిరెడ్డి, ఎంపీపీలు సరళహన్మంతరెడ్డి, బాలాజీనాయక్, శ్రీవిద్యరాజు, ధీరావత్ నందినిరవితేజ, సునీతకృపయ్య, జెడ్పీటీసీలు లలిత హాతీరాం, సేవ్యానాయక్, మంగమ్మవెంకటయ్య, జిల్లా కోఆప్షన్ సభ్యులు మోసిన్‌అలీ, నాయకులు యూసుఫ్, అన్నబీమోజు నాగార్జునచారి, ఆర్డీఓ చెన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ శ్రీనివాస్‌నాయక్, సిబ్బంది పద్మనాభం, దేవేందర్‌రావు, నరేందర్, మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల చినరామయ్య, మట్టపల్లి సైదయ్యయాదవ్, కరుణాకర్‌రెడ్డి, బాబయ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఏడుకొండలు, మధుసూదన్, ఆయా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


దళితబంధు పథకం యూనిట్లను అందజేస్తున్న ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే భాస్కర్‌రావు